క్లుప్తంగా

ఘనంగా ప్రారంభమైన గౌరీ పరమేశ్వరుల పండగ



ఉమ్మలాడలో గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక:మండలంలోని ఉమ్మలాడ,చూచుకొండ గ్రామాల్లో శనివారం గౌరీ పరమేశ్వరుల పండగ ఘనంగా ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లోని గౌరీ పరమేశ్వరులను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

శ్రీదేవీతల్లి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక:మండలంలోని ఉమ్మలాడలో శ్రీదేవితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఉమ్మలాడకు చెందిన కాండ్రేగుల నారాయణమూర్తి-అచ్చియమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు రామప్పారావు శనివారం రూ.30వేలు అందజేశారు. ఆలయకమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు ఈ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలు అభివృద్ధి చేయాలి



సత్యవరం సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట: ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను అభివృద్ధి చేయాలని ఈవోఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ సచివాలయ సిబ్బందికి సూచించారు. సత్యవరం, ఎస్.నర్సాపురం గ్రామ సచివాలయాలను ఆయన శనివారం సందర్శించారు. సంపద కేంద్రాలపై ఆయా సర్పంచ్‌లతో మాట్లాడారు. ఎస్.నర్సాపురం, సత్యవరం గ్రామాల్లో రెండు టన్నుల వర్మీకంపోస్టు అమ్మకంపై సర్పంచ్‌లతో చర్చించినట్టు ఈవోఆర్డీ తెలిపారు.

రహదారి నిబంధనలపై అవగాహన



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ

యలమంచిలి రూరల్: రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే వాహన చోదకులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ చెప్పారు. శనివారం రేగుపాలెం హైవే జంక్షన్ వద్ద పలు వాహనాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం రహదారి నిబంధనలపై ఆయన వాహన చోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి బైక్‌లు నడపాలని, రాంగ్‌రూట్ డ్రైవింగ్ ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటూ పోస్టర్ల ప్రదర్శన

మునగపాక:ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి కోరారు. ఈ మేరకు స్కూల్‌లో శనివారం పోస్టర్ల ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యలమంచిలి మున్సిపాలిటీలో మొండి బకాయిల చిట్టా రోజురోజుకీ పెరిగిపోతోంది. ఏళ్లతరబడి పేరుకుపోతున్న పన్ను బకాయిలను వసూలు చేయడానికి అధికారులు గట్టిగా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడంలేదు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్నులు రూ.లక్షల్లో పేరుకుపోతున్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి మున్సిపాలిటీకి రూ.1.09 కోట్ల బకాయిలు రావలసి ఉంది.

కొండలా మొండి బకాయిలు



యలమంచిలి మున్సిపల్ కార్యాలయం

- యలమంచిలి మున్సిపాలిటీకి పన్నులు చెల్లించని ప్రభుత్వ సంస్థలు
- వసూళ్లకు మొక్కుబడిగా చర్యలు



పన్ను వసూళ్లకు సంబంధించి కంప్యూటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

యలమంచిలి రూరల్: సామాన్యులు పన్ను చెల్లించకపోతే మున్సిపల్ అధికారులు నానాహడావుడి చేస్తారు.నగదు సర్దుబాటు కాక ఆలస్యంగా చెల్లిస్తే జరిమానాలు వేస్తారు.అలాంటిది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు,వాటి ఆస్తులకు సంబంధించిన పన్నులు లక్షల్లో పేరుకుపోతున్నా పట్టడం లేదు.యలమంచిలి మున్సిపాలిటీలో పదుల సంఖ్యలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు,ఆయా శాఖలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి.వీటిలో 90శాతానికి పైగా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి రెండు దశాబ్దాలకు పైగా పన్ను బకాయిలు పేరుకుపోయాయి.అసలు తాము మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాం... మున్సిపాలిటీ నుంచి సౌకర్యాలు పొందుతున్నాం..అందుకు పన్నులు చెల్లించాలి అన్న విషయమే ఆయా శాఖలు మరిచిపోయాయి. బకాయిలు చెల్లించాలన్న స్పృహ ఆయా శాఖల అధికారుల్లో కానరావడం లేదు.పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులు.ఇలాంటి పన్నులు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదని తెలుస్తోంది.అందుకే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.కోట్లకు చేరాయని తెలుస్తోంది. ఈ ప్రభావం నేరుగా పట్టణ అభివృద్ధిపై పడుతోంది.

ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.1.09 కోట్లు

నియోజకవర్గ కేంద్రం యలమంచిలి పట్టణంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఆస్తిపన్ను బకాయిలు ఏటికేడాది పెరిగిపోతున్నాయి.మొత్తం 28 కార్యాలయాలకు సంబంధించి రూ.1,09,65,207 పన్ను రూపంలో వసూలు కావాల్సి ఉంది. యలమంచిలి పురపాలక సంఘంలో మొత్తం 10,725 అసెస్‌మెంట్లు ఉండగా వీటి ద్వారా పాత బకాయిలతో కలిపి ఈ ఏడాది రూ. 4,37,36,908 వసూలు కావాల్సి ఉంది.ఇప్పటివరకు సుమారు రూ.1.91 కోట్ల మేర పన్నులు వసూలయ్యాయి.ఈ లెక్కన 43.70 శాతం మాత్రమే పన్ను వసూళ్లు జరిగాయి. కొండలా పేరుకుపోయిన మొండి బకాయిల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిందే ఎక్కువగా ఉంది.వీటిని వసూలు చేసే పరిస్థితి కనిపించడంలేదు.ఈ పన్నులు ఎప్పుడు వసూలవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.ఆర్థిక సంవత్సరం మరో 125 రోజుల్లో ముగుస్తుంది.ఈ నేపథ్యంలో భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలు అధికారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.దీంతో బకాయిల వసూళ్లకు పురపాలక రెవెన్యూ విభాగం అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఆస్తిపన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ వేగవంతం చేశారు.నిర్ణీత గడువు లోగా ఆస్తిపన్ను చెల్లించకపోతే ఏపీ మున్సిపల్ చట్టం 1965లోని రెవెన్యూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొంటున్నారు.చెల్లించాల్సిన పన్ను,జరిమానా మొత్తాలని నోటీసుల్లో పొందుపరుస్తూ రెవెన్యూ అధికారులు బిల్ కలెక్టర్లు,సచివాలయాల సిబ్బంది ద్వారా పంపుతున్న డిమాండ్ నోటీసులకు ప్రభుత్వ శాఖల అధికారుల నుంచి ఎంతమేర స్పందన వస్తుందో వేచి చూడాలి.

సౌకర్యాల కల్పనకు పన్ను వసూళ్లే కీలకం

సుమారు 55 వేల జనాభా నివసిస్తున్న యలమంచిలి పట్టణంలో తాగునీరు,రహదారులు,డ్రైనేజీలు,విద్యుత్ దీపాల నిర్వహణ,మౌలిక సదుపాయాల కల్పన,ఇతర అత్యవసర సమస్యలు పరిష్కరించేందుకు పురపాలక సంఘానికి ఆర్థిక పరిపుష్టి అవసరం. ఇందుకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కీలకం. ప్రభుత్వం నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరైనా అన్ని అవసరాలు తీరాలంటే పురపాలక సంఘం సొంత ఆదాయంపై ఆధారపడాల్సి ఉంటుంది.ఇందుకు రెవెన్యూ విభాగం పన్నులు సకాలంలో వసూలు చేయడం,మొండి బకాయిలు రాబట్టడం తదితర విషయాలపై ప్రధానంగా దృష్టి పెట్టాల్సి ఉంటుంది.కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8 నెలలు గడిచినా నిర్దేశిత లక్ష్యాల్లో 43 శాతమే పూర్తి చేయగలిగారు.ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిలు చేయాల్సి ఉంది.

ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు ఇలా..

కార్యాలయం	బకాయి రూ.లలో
సబ్ పోస్టాఫీస్	3,75,777.00
కొక్కిరాపల్లి పీఏసీఎస్	రూ.1,43,073
ఏటికొప్పాక చక్కెర కర్మాగారం కాటా	రూ.11,884
భారత్ పెట్రోలియం అవుట్‌లెట్	రూ.63,634
పట్టణ పోలీస్ స్టేషన్	రూ.13,576
పట్టణ పోలీస్ స్టేషన్ క్వార్టర్స్	రూ.1,88,490
సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం	రూ.2,21,318
ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ కార్యాలయం	రూ.26,025
రోడ్లు,భవనాల శాఖ కార్యాలయం	రూ.86,721
దేవదాయశాఖ ఈవో కార్యాలయం	రూ.3,47,381
ఏపీఎస్ఆర్టీసీ మేనేజర్	రూ.26,927
ఈడీ ఎస్సీ కార్పొరేషన్	రూ.7,05,741
ఆర్అండ్‌బీ బంగ్లా	రూ.2,83,695
జెడ్పీ విశ్రాంతి భవనం	రూ.2,57,034
ఈడీ ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య సముదాయం	రూ.6,56,613
జెడ్పీ సీఈవో	రూ21,59,983
ఎంపీడీవో కార్యాలయం	రూ.8,30,658
ఎంపీడీవో కార్యాలయం టెక్నాలజీ కేంద్రం	రూ.11,06,064
డీఈఈ పంచాయతీరాజ్	రూ.10,38,167
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	రూ.1,70,739
డీఈఈ ఆర్అండ్‌బీ	రూ.3,87,088
డీఈఈ కార్యాలయం(ఆర్ డబ్ల్యూఎస్)	రూ.2,826
వైఎస్సార్ టెస్ట్ ల్యాబ్	రూ.1,43,073
ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ కొక్కిరాపల్లి	రూ.1,49,405
రూరల్ పోలీస్ స్టేషన్	రూ.4,95,336
తహసీల్దార్ కార్యాలయం	రూ.7,07,724
ఫారెస్ట్ రేంజర్ కార్యాలయం	రూ.2,71,402
బ్రిడ్జి స్కూల్	రూ.1,34,114
మొత్తం	రూ.1,09,65,207

బకాయిల వసూలుకు చర్యలు



పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి రెవెన్యూ కార్యదర్శులు,సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించాం. ప్రభుత్వ కార్యాలయాల పన్నుబకాయిల వసూలుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ఆర్ఐలు,ఆర్వోలు,సంబంధిత సిబ్బంది క్షేత్రస్థాయికివెళ్లి నోటీసులుఅందజేస్తున్నారు. పన్ను వసూలు కోసం ఆయా శాఖలు ప్రభుత్వం నుంచి బడ్జెట్‌కు ఆమోదం పొందాలని చెబుతున్నాం.

–బి.జె.ఎస్. ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

నోటీసులు జారీ చేస్తున్నాం



పన్ను బకాయిలు పేరుకుపోయిన ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు నోటీసులు జారీ చేస్తున్నాం.పట్టణంలో 28 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి.వీటి నుంచి పన్ను వసూళ్లు 20 ఏళ్ల నుంచి సక్రమంగా జరగడంలేదు.ప్రస్తుతం వీటికి సంబంధించి నోటీసులు అందజేసే ప్రక్రియ దాదాపుగా పూర్తయింది.బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారు. మార్చిలోగా బకాయిల వసూళ్లు జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– టి.విశ్వేశ్వరరావు,రెవెన్యూ అధికారి

రూపుమారిన కొమ్మాయి గుండం పరిసరాలు



రూపుమారిన కొమ్మాయిగుండం చెరువు పరిసరాలు

యలమంచిలి రూరల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంతో స్థానిక ఆర్టీసీ బస్టాండు పక్కనున్న కొమ్మాయిగుండం చెరువు పరిసరాలు పూర్తిగా మారాయి. చిట్టడివిలా ఉండే ఈ ప్రాంతంలో మార్నింగ్ వాకర్స్‌కు ఉపయోగపడే వాకింగ్ ట్రాక్ సమకూరడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. పట్టణ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే ప్రాంతాలను ఎంపిక చేసుకుని ప్రతి శనివారం మున్సిపల్ అధికారులు,ఉద్యోగులు,సచివాలయ సిబ్బంది వ్యర్థాలు,తుప్పల తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ శనివారం కొమ్మాయిగుండంలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బి.జె.ఎస్.ప్రసాద రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలంతా సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు.స్వచ్ఛ యలమంచిలి సాధించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు చిట్టడవిలా ఉన్న కొమ్మాయి గుండం చెరువు వద్ద తుప్పలు,వ్యర్థాలను తొలగించి శుభ్రపరచడంతో పాటు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఇది మార్నింగ్ వాక్ చేయడానికి వీలుగా ఉందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు.



చెరువు పరిసరాల వద్ద తుప్పలు,వ్యర్థాలు తొలగిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

రెండు గ్రామాల్లో క్యాన్సర్ పరీక్షలు

మాకవరపాలెం: మండలంలోని రెండు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాపయ్యపాలెం, మాకవరపాలెంలో శనివారం హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లోనూ 20 మందిని పరీక్షించగా నలుగురికి క్యాన్సర్ ఉన్నట్టు గుర్తించామని బూరుగుపాలెం వైద్యాధికారి చరిష్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటి లక్షణాలపై వైద్య సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి



చినదొడ్డిగల్లులో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



యలమంచిలి పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



పట్టణంలోని నాగేంద్రుని ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నక్కపల్లి: సుబ్రహ్మణ్య షష్టిని శనివారం పలు చోట్ల అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కపల్లి, గొడిచర్ల, చినదొడ్డిగల్లులలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. నాగుల చవితినాడు పుట్టలో పాలు పోసే అవకాశం లేని వారు సుబ్రహ్మణ్యషష్టినాడు పుట్టల్లో పాలు పోసి నాగేంద్రుడికి పూజలు నిర్వహించారు. చినదొడ్డిగల్లు శ్రీరామపంచాయతన ఆలయంలో ధర్మకర్త శ్రీపాద సత్యదేవ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. గొడిచర్ల శేషలింగేస్వర ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కలనుంచి భక్తులు వచ్చారు.

మునగపాక: మండలంలోని మునగపాక,తిమ్మరాజుపేట గ్రామాల్లో శనివారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అయ్యప్పస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తిమ్మరాజుపేట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

యలమంచిలి రూరల్: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక పూజలు జరిగాయి. నాగేంద్రకాలనీలో ఉన్న నాగేంద్రస్వామి, పాతవీధిలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వెయ్యి మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామి సన్నిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి,రామకృష్ణ దంపతుల చేతుల మీదుగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ క్రతువును తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నాగేంద్రుని ఆలయం వద్ద మధ్యాహ్నం సుమారు 2వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఊడి బాబులు, సిరసపల్లి రమణ,స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయం ప్రాంగణంలో అన్న సమారాధనలో భక్తులు



తిమ్మరాజుపేటలో సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు



జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన



జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న అధికారులు

కోటవురట్ల: తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థుల నుంచి మంచి ఫలితాలను రాబట్టవచ్చని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జల్లూరులో జరిగిన సమావేశంలో ప్రత్యేకాధికారి పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో లోపాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటలపోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఎంఈవో రామారావు, సర్పంచ్ లాలం పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, హెచ్ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీటీసీ సభ్యురాలు కాళ్ల రత్నం, పైల నాని, గొల్లు చిట్టిబాబు, రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్ఎం నానిమణిమోహన్, సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ యల్లపు కుమారరాజా, పందూరు ఎంపీపీ స్కూల్ సర్పంచ్ చీకట్ల జగదీష్, మాజీ సర్పంచ్ టి.నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పాయకరావుపేట: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉత్తమ పౌరులుగా అభివృద్ధి చెందాలని మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్ గాంధీ, ఎంపీడీవో జయప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో జరిగిన సమావేశంలో ఎంపీడీవో, ఎంఈవోలు మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి మంచి మార్కులతో ఉత్తీర్ణతతో సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. విద్యార్థులు తల్లిదండ్రులతో టగ్‌ఆఫ్‌వార్ ఆడించారు. ఈ సమావేశాల్లో ఎంఈవో-2 రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో పలు పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. దేవవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో వర్మ మాట్లాడుతూ విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు, పాఠశాలల్లో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, దాతల నుంచి సలహాలు, సహకారం తీసుకుంటున్నట్టు చెప్పారు. నక్కపల్లి వేంపాడు, ఉద్దండపురం, గొడిచర్ల, పెదబోదిగల్లం, చినదొడ్డిగల్లు తదితర జెడ్పీ పాఠశాల్లో సమావేశాల అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాఘవకుమారి, ఎంఈవో నూకరాజు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ,మాజీ వైస్ఎంపీపీ గొర్ల నర్సింహమూర్తి,ఉప సర్పంచ్ వేగేశ్న చంటి,విద్యకమిటీ చైర్మన్ ఎం.ఫణికుమార్ పాల్గొన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

మునగపాక: పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు తెలిపారు. మండల వ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలను అన్ని పాఠశాలల్లో నిర్వహించారు.మునగపాక,తిమ్మరాజుపేట హైస్కూళ్లలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఎస్ఐ పి.ప్రసాదరావు,స్కూల్‌కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా సమావేశాలు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో శనివారం పేరెంట్స్,టీచర్స్(పీటీఎం) సమావేశాలు ఉత్సాహంగా జరిగాయి.యలమంచిలి పట్టణం,మండలంలో అన్ని ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో ఈ సమావేశాలు నిర్వహించారు.తులసీనగర్ జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తమ పాఠశాలలో విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయురాలు వి.వి.హిమబిందు సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులకు చెప్పారు. కొత్తపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం సమావేశానికి రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఇక్కడ విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. సోమలింగపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బోదెపు సాయిబాబు మాట్లాడుతూ పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు.కొక్కిరాపల్లి అంబేడ్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం మాట్లాడుతూ విద్యార్థులకు అందజేస్తున్న నాణ్యమైన విద్య,పోషకాహారం,విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు.మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు,ఎంపీపీ బోదెపు గోవిందు,సీఐ ధనుంజయరావు,ఎంఈవో అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

మత్తు పదార్థాల జోలికి వెళ్లనివ్వొద్దు

మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో శనివారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటుపడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటిని ఎలా ఎదుర్కో వాలనే దానిపై అవగాహన కల్పించారు.

అచ్యుతాపురం:మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పాయకరావుపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో కె.ఎన్. గాంధీ



టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న విద్యార్థుల తండ్రులు




దేవవరం పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వర్మ



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు



కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



ఏటికొప్పాక హైస్కూల్‌లో మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర